ఆంధ్రజ్యోతి ఆదివారం, 31 జూలై 2011

# ఆధార్ అంటే పౌరుడిపై నిఘానే

## యూఐడీపై ఓపెన్ ఫోరంలో వక్తలు

హైదరాబాద్, జూలై 30 (ఆన్‌లైన్, సిటీబ్యూరో)''ఆధార్ అంటే ప్రతి పౌరుడి మీద నిఘా వేసే ప్రక్రియ..ఇది మావన హక్కుల ఉల్లంఘన...మానువులను సంఖ్యగా మారుస్తోంది. ప్రతి పౌరుడి సమచారాన్ని రహస్యంగా ఉంచాల్సిన ప్రభుత్వం ఈ ప్రక్రియ ద్వారా బహిర్గతం చేస్తోంది....ఆధార్(యూఐటీ) ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు'' అని పలువురు వక్తలు... ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం 'ఓపెన్ ఫోరం ఆన్ యూఐడీ(ఆధార్)' పై డక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ, నేషనల్ అలయన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్‌మెంట్, హ్యుమన్ రైట్స్ లా నెట్ వర్క్, , ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో చర్చ కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న పలువురు వ్యక్తులు, ప్రజలు ఆధార్ ప్రక్రియపై సందేహాలు వ్యక్తం చేశారు. ఆధార్‌ను నిలిపివేయడమే మంచిదనే భావన ఈ ఓపెన్ ఫోరంలో వ్యక్తం అయింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిటీజన్ ఫోరం సివిల్ లిబర్టీస్ సభ్యుడు గోపాలకృష్ణ మాట్లాడుతూ ఆధార్ ప్రతి పౌరుడిపై నిఘా వేసేది తయారైందన్నారు. యూఐడీ (ఆధార్) నిర్వహించే కంపెనీలు అమెరికా నిఘా సంస్థల ఆధీనంలో పనిచేసేవన్నారు. యూఐడీ కార్యక్రమం వరల్డ్ బ్యాంక్ ప్రాజెక్టని, వారి సూచనల మేరకే యూఐడీ నిర్వహించే కంపెనీలు కూడా పనిచేస్తాయన్నారు. మొదట్లో దీనిని స్వచ్ఛందగా చేసుకోవచ్చునన్నారని, ఇప్పుడేమే ప్రతి అంశాన్ని అధార్‌తో ముడిపెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఆధార్ కోసం వేలిముద్రలు తీసుకుంటున్నారని, ఇది కష్టపడే శ్రామికులు, రైతులు, కూలి పనులు చేసుకునే వారి వేలిముద్రలు భవిష్యత్తులో మారే ప్రమాదముందని, దీని వల్ల వారు అనర్హులుగా గుర్తించే అవకాశముందని గోపాలకృష్ణ తెలిపారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

### ఇంత వత్తిడి ఎందుకు

ఆధార్ పేరుతో ప్రజలపై ఎందుకు నియంత్రణ పెట్టాలని ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక జాయింట్ కన్వీనర్ సరస్వతి పేర్కొన్నారు. బలవంతంగా ఆధార్‌ను తీసుకోమని వత్తిడి చేయడం ఎందుకని ఆమె ప్రశ్నించారు.

### సభ్యులుగా నేరస్థులు

ఆధార్ ప్రక్రియ కోసం ఏర్పాటు చేసిన కమిటీలో నేరస్థులు ఉన్నారని, అలాంటప్పుడు ఈ కార్యక్రమం నిజాయితీ ఎలా జరుగుతుందని ఓపెన్ ఫోరంలో పాల్గొన్న విద్యార్థి అబీబ్ ముస్తాఫ్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

### సామాన్యులకు ఇబ్బందే

దారిద్ర్యరేఖకు దిగువనున్న వర్గాలకు ఈ ఆధార్ ప్రక్రియ ఇబ్బందిగా మారే ప్రమాదముందని చైతన్య రూరల్ ఉమెన్ డవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధి కె. వీరస్వామి అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆధార్ ప్రక్రియ పూర్తిగా అమలు జరిగితే వారికి అందాల్సిన ఫలాలు అందకుండా పోతాయన్నారు.ఈ కార్యక్రమంలో డక్కన్ డవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ సతీష్, హ్యుమన్ రైట్స్ లా నెట్‌వర్క్ ప్రతినిధి హకీల్ తదతరులు పాల్గొన్నారు.